నమస్తే తెలంగాణ
సిద్దిపేట
I హైదరాబాద్, శనివారం 3 మే 2025 SIDDIPET

# తెలంగాణను విస్మరించిన కేంద్రం



మాజీ మంత్రి హరీశ్‌రావు సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన న్యాల్‌కల్ మండలం రత్నాపూర్‌కు చెందిన బీజేపీ నాయకులు, కార్యకర్తలు

- రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం
- సంగమేశ్వర, బసవేశ్వర ఎత్తిపోతలను పక్కన పెట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం
- ప్రజలు, రైతుల కోసం పోరాడే శక్తి బీఆర్‌ఎస్‌కే ఉంది
- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు
- బీఆర్‌ఎస్‌లో చేరిన న్యాల్‌కల్ బీజేపీ నాయకులు, కార్యకర్తలు

జహీరాబాద్, మే 2: తెలంగాణను కేంద్ర బీజేపీ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. తెలంగాణకు మోదీ సర్కారు అన్యాయం తప్ప ఏం చేయలేదని మండిపడ్డారు. మరోవైపు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆయన విమర్శించారు. శుక్రవారం హైదరాబాద్‌లో హరీశ్‌రావు నివాసంలో జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు ఆధ్వర్యంలో న్యాల్‌కల్ మండలంలోని రత్నాపూర్‌కు చెందిన 50 మంది బీజేపీ నాయకులు, కార్యకర్తలు బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు రత్నాపూర్ గ్రామ మాజీ సర్పంచ్ రవికుమార్, సీనియర్ నాయకులు తుకారం, బస్వరాజ్, సంగ్‌శెట్టి, సంజీవ్, అమృత్ తదితరులను కండువాలను వేసి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దక్షిణాది రాష్ట్రాలపై బీజేపీ చిన్నచూపు చూస్తోందన్నారు. తెలంగాణకు తీవ్ర అన్యాయం చేస్తున్నదని మండిపడ్డారు. మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని దుయ్యబట్టారు. ప్రధానంగా కరెంట్ సమస్యలు, రైతుభరోసా, రైతు రుణ మాఫీ, బీమా వంటి పథకాలకు తిలోదకాలు ఇచ్చిందని ధ్వజమెత్తారు. సంగారెడ్డి జిల్లా అభివృద్ధిని కాంగ్రెస్ నిర్లక్ష్యం చేస్తున్నదని, ఎస్డీఎఫ్, టీపీఐడీసీ నిధులను విడుదల చేయకుండా అన్యాయం చేస్తున్నదన్నారు. బీఆర్‌ఎస్ పాలనలో పూజచేసిన బసవేశ్వర, సంగమేశ్వర ఎత్తిపోతల పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా పక్కన పెట్టిందన్నారు. సంగారెడ్డి జిల్లాను సస్యశ్యామలం చేసేందుకు ఈ ఎత్తిపోతలకు కేసీఆర్ శ్రీకారం చుడితే, ప్రస్తుత కాంగ్రెస్ దుర్మార్గంగా వ్యవహరిస్తూ ఆ పనులు ఆపేసిందన్నారు. రైతులు, ప్రజల సమస్యల సాధన కోసం పోరాడే శక్తి బీఆర్‌ఎస్‌కు మాత్రమే ఉందని, బీఆర్‌ఎస్ ఎప్పుడూ పేదలు, తెలంగాణ ప్రజల పక్షాన నిలుస్తుందని హరీశ్‌రావు పేర్కొన్నారు. కార్యక్రమంలో జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు, ఉమ్మడి జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, బీఆర్‌ఎస్ న్యాల్‌కల్, కోహీర్ మండలాల అధ్యక్షులు రవీందర్, నర్సింలు, మాజీ ఎంపీటీసీ దేశెట్టి పాటిల్, మండల నాయకులు ఎంఆర్ ప్రవీణ్‌కుమార్, పడకంటి వెంకట్ పాల్గొన్నారు.

# జర్నీ ఆఫ్ ట్రూ లీడర్ పుస్తకావిష్కరణ



సంబురం జర్నీ ఆఫ్ ట్రూ లీడర్ బుక్ ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి హరీశ్‌రావు, చిత్రంలో కాల్వగడ్డ రాజ్‌కుమార్, రచయితలు

రామచంద్రాపురం, మే 2: తెలంగాణకు సంబంధించి 60 ఏండ్ల విశేషాలను వివరిస్తూ 'సంబురం' జర్నీ ఆఫ్ ట్రూ లీడర్ పుస్తకాన్ని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు ఆవిష్కరించారు. 'సంబురం' పుస్తకాన్ని రచించిన టీజీ 24x7 బృందం, పుస్తక ప్రచురణకు ఆర్థిక సహకారం అందించిన ఆర్‌కే ఫౌండేషన్ చైర్మన్, బీఆర్‌ఎస్ యువ నాయకుడు కాల్వగడ్డ రాజ్‌కుమార్ శుక్రవారం హైదరాబాద్‌లోని హరీశ్‌రావు నివాసంలో ఆయనను వారు ప్రత్యేకంగా కలిశారు. అనంతరం ఆయన చేతుల మీదుగా 'సంబురం' పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఆ తర్వాత ఆయన సంబురం పుస్తకాన్ని పరిశీలించి చదివారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. 2001 పార్టీ స్థాపించిన నాటి నుంచి 25ఏండ్ల బీఆర్‌ఎస్ ప్రస్థానం వరకు స్వరాష్ట్రం కోసం కేసీఆర్ పోరాటం, అధికారంలో బీఆర్‌ఎస్ చేసిన విజయాలతో పాటు ఇటీవల జరిగిన రజతోత్సవం సభ అంశాలను ప్రతీది నిక్షిప్తం చేస్తూ పుస్తకం రూపంలో రచించడం చాలా సంతోషాన్ని కలిగించిందన్నారు. 'సంబురం' జర్నీ ఆఫ్ ట్రూ లీడర్ అనే క్యాప్షన్ చాలా బాగుందన్నారు. ఒక నిబద్ధత, నిజాయితీ, పట్టుదల, ధైర్యం, కార్యసాధకుడు ఇవన్నీ కలగలిపితే కేసీఆర్ అని, ఆయన కృషిని గుర్తించి 'జర్నీ ఆఫ్ ట్రూ లీడర్' క్యాప్షన్ పెట్టడం పుస్తకానికే వన్నె తెచ్చిందన్నారు. పుస్తక రచయితలైన సీనియర్ పాత్రికేయులు కోటిరెడ్డి, బాలకృష్ణ, మాలతి, తేజలతో పాటు పుస్తకం ప్రచురణకు ఆర్థిక సహకారం అందించిన కాల్వగడ్డ రాజ్‌కుమార్‌ను ప్రత్యేకంగా అభినందించారు. సంబురం పుస్తకం చూస్తుంటే, చదువుతుంటే బీఆర్‌ఎస్ విజయాలు, పోరాటాలు, కేసీఆర్ సాధించిన విజయాలు కండ్లకు కట్టినట్లు కనిపిస్తుందని హరీశ్‌రావు తెలిపారు. ఈ సందర్భంగా రాజ్‌కుమార్‌ని హరీశ్‌రావు అభినందించారు.

# ఎల్లమ్మ ఆలయ పాలక మండలి ఏర్పాటయ్యేనా?

- మంత్రి పొన్నం అసంతృప్తే కారణమా..?



హుస్నాబాద్‌లోని రేణుకా ఎల్లమ్మ ఆలయం

హుస్నాబాద్ టౌన్, మే 2: తెలంగాణలో అతిపెద్ద ఎల్లమ్మ దేవాలయంగా గుర్తింపు పొందిన హుస్నాబాద్‌లోని రేణుకా ఎల్లమ్మ ఆలయ ఉత్సవాలు మరో ఎనిమిది రోజుల్లో ప్రారంభం కానున్నాయి. ఏటా ఈ ఆలయానికి పాలక మండలిని నియమిస్తున్నారు. గతేడాది నుంచి పాలక మండలిని నియమించకపోవడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. కాంగ్రెస్ ప్రభుత్వం పాలక మండలిని నియమించక పోవడంతో అధికారుల నిర్వహణలో ఆలయం కొనసాగుతున్నది. కాకతీయుల కాలంలో నిర్మించిన హుస్నాబాద్‌లోని రేణుకా ఎల్లమ్మ ఆలయానికి ఏటా మే నెలలో జరిగే జాతరకు వేలాది మంది భక్తులు హాజరవుతారు. ఆలయ కమిటీ చైర్మన్ పదవికి కాంగ్రెస్‌కు చెందిన పూదరి శ్రీనివాస్‌గౌడ్, పచ్చిమట్ల శ్రీకాంత్‌గౌడ్, పూదరి నర్సాగౌడ్, గట్టు రామకృష్ణ, మాజీ అధ్యక్షుడితో పాటు పలువురు పోటీపడుతున్నారు. మూడు నెలల క్రితం పాలకమండలి సభ్యులకు దేవాదాయ, ధర్మాదాయ శాఖకు దరఖాస్తు చేసుకున్నారు. స్థానిక నాయకుల మధ్య ఏకాభిప్రాయం లేకపోవడంతో బీసీ సంక్షేమం, రవాణా శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ కమిటీని నియమించే విషయంపై ఒక నిర్ణయానికి రాలేదని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఆలయ భూముల విషయంపై ఇటీవల చెలరేగిన వివాదంలో కాంగ్రెస్ నాయకులు సరైన విధంగా స్పందించలేదనే భావన మంత్రి పొన్నం ప్రభాకర్‌లో అసంతృప్తికి కారణమని తెలుస్తోంది. ఆలయ భూములను తానే కబ్జా చేశాననే విధంగా ప్రచారం చేసినప్పటికీ, ప్రతిపక్షాల విమర్శలను సరైన రీతిలో తిప్పికొట్టక పోవడంతో ఆలయ కమిటీని నియమించే విషయాన్ని స్వయంగా మంత్రి బ్రేక్‌లు వేసినట్లు ప్రచారం సాగుతున్నది. జాతరకు వారం రోజులు మాత్రమే ఉన్న నేపథ్యంలో పూర్తిస్థాయి పాలకమండలిని నియమించే అవకాశాలు లేవు. ఈ తరుణంలో ఉత్సవ కమిటీనైనా నియమిస్తారని ఆశగా భక్తులు ఎదురుచూస్తున్నా వారికి నిరాశే తప్పదనట్లు తెలుస్తోంది.

# వేసవిలో జాగ్రత్తలు తీసుకోవాలి

మెదక్, మే 2(నమస్తే తెలంగాణ): ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతున్నందున, ప్రజలు ఎండదెబ్బ బారిన పడకుండా అవగాహన కల్పించాలని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. ఎండదెబ్బ తగలకుండా జాగ్రత్తలు పాటించాలని, మధ్యాహ్నం 12 గంటల నుంచి 4 వరకు ఇండ్ల నుంచి బయటకు రావొద్దని ప్రజలకు సూచించారు. ఉష్ణోగ్రతలు రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో వడదెబ్బలు, ఇతర సమస్యలు వచ్చే ప్రమాదం ఉందన్నారు. వడదెబ్బ తగిలిన వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రచారం చేయాలని వైద్యశాఖను ఆదేశించారు. ఎండాకాలంలో నిలిపి ఉన్న వాహనాల్లో పిల్లలు, పెంపుడు జంతువులను వదలవద్దని, మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు వంట నివారించాలని, ఎండల్లో పనిచేయవద్దని సూచించారు. చిన్నారులు, వయోవృద్ధులు ఇంటికే పరిమితం కావాలని సూచించారు. ఎండలో పనిచేసే కార్మికులు తరుచుగా నీటితో పాటు ఓఆర్‌ఎస్ ద్రావణాన్ని తీసుకోవాలని, అధిక శరీర ఉష్ణోగ్రత, అలసట, నోరు ఎండిపోవడం, తలనొప్పి, ఒళ్లునొప్పులు, వాంతులు, జ్వరం వంటి లక్షణాలు కనిపిస్తే సమీప ప్రభుత్వ దవాఖానల్లో సంప్రదించి లేదా 108కు ఫోన్ చేసి చికిత్స, అవసరమైన మందులు పొందాలని కలెక్టర్ పేర్కొన్నారు.

# రేషన్ కార్డు అందని ద్రాక్షేనా?

## అర్హులకు అందని రేషన్ కార్డులు

- ఉమ్మడి మెదక్ జిల్లాలో మీసేవ ద్వారా 12,139 దరఖాస్తులు
- మంజూరైనవి 2,447, పెండింగ్‌లో 9,692
- గ్రామాలు, మున్సిపాలిటీల్లో ప్రజాపాలనలోని దరఖాస్తులపై విచారణ
- ప్రభుత్వ తీరుపై మండిపడుతున్న నిరుపేదలు
- జిల్లాలో రేషన్‌కార్డుల కోసం ఎదురుచూపులు





సిద్దిపేట, మే 2 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): అధికారం కోసం కాంగ్రెస్ అలవికాని హామీలు ఇచ్చింది. అధికారంలోకి వచ్చిన తర్వాత మాట మార్చింది. అందరికీ రేషన్ కార్డులు ఇస్తామని అసెంబ్లీ ఎన్నికల ముందు పెద్ద పెద్ద మాటలు చెప్పి తీరా అధికారంలోకి వచ్చాక మొండిచెయ్యి చూపింది. సిద్దిపేట జిల్లాలో ఆన్‌లైన్‌లో 2,562 దరఖాస్తులు చేసుకోగా 1562 మంజూరు చేశారు. మెదక్ జిల్లాలో 1,262 దరఖాస్తు చేసుకోగా 450, సంగారెడ్డి జిల్లాలో 8,315 దరఖాస్తు చేసుకోగా 435 రేషన్‌కార్డులు మంజూరు చేశారు. ఏదో మంజూరు చేయలేదనకుండా జిల్లాకు కొన్ని మంజూరు చేసి ప్రభుత్వం చేతులు దులుపుకుంది. కాంగ్రెస్ ప్రభుత్వం మాటలు నమ్మి ప్రజాపాలనలో పెద్దఎత్తున ప్రజలు దరఖాస్తులు చేసుకున్నారు. తమ పేర్లు రేషన్ కార్డులో యాడ్ చేయాలని దరఖాస్తు చేసుకున్నా మోక్షం లేదు. ప్రజాపాలన, కుటుంబ సమగ్ర సర్వే, మీ సేవల ద్వారా దరఖాస్తులు చేసుకున్నా అర్హులకు రేషన్ కార్డులు రావడం లేదు. పైరవీకార్లు చెప్పిన వారికే రేషన్ కార్డులు మంజూరు చేశారన్న విమర్శలు బలంగా ఉన్నాయి. తమకు రేషన్‌కార్డు వస్తది అని ఆశ పడిన నిరుపేదలకు నిరాశే మిగిలింది. ప్రస్తుతం గ్రామాలు, మున్సిపల్ వార్డుల్లో ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులపై విచారణ చేస్తున్నారు. ఇందులో ఎంతమందికి రేషన్ కార్డులు వస్తాయన్నది ప్రశ్నార్థకంగా మారింది.

### రేషన్ కార్డు కోసం పెద్దసంఖ్యలో దరఖాస్తులు

సిద్దిపేట జిల్లాలో రేషన్‌కార్డుల కోసం 2,562 మంది దరఖాస్తు చేసుకోగా 62 తిరస్కరించారు. వీటిలో 1562 మందికి మంజూరు చేశారు. మిగతావి పెండింగ్‌లో ఉన్నాయి. పేర్ల (యాడింగ్) నమోదు కోసం 64,384 దరఖాస్తులు వస్తే ఇప్పటి వరకు 45,269 మాత్రమే చేసి మిగతావి పెండింగ్‌లోనే ఉన్నాయి. మెదక్ జిల్లాలో రేషన్ కార్డుల కోసం 1262 దరఖాస్తులు వస్తే కేవలం 450 కార్డులు మాత్రమే మంజూరు చేశారు. సంగారెడ్డి జిల్లాలో 846 రేషన్ షాపులు ఉండగా కొత్త రేషన్ కార్డుల కోసం మీ సేవ ద్వారా 8,315 దరఖాస్తులు రాగా 435 కార్డులు మంజూరు చేశారు. కొత్తగా పేర్లు జత చేయడం కోసం 54,421 దరఖాస్తులు రాగా 52,548 యాడ్ చేశారు. తొలుత ప్రజాపాలన, ఆ తర్వాత సమగ్ర సర్వేలో రేషన్ కార్డులు లేదంటూ దరఖాస్తు చేసుకున్నారు. మీ సేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకున్నా నిరాశే మిగిలింది. ఇలా ప్రజలు చేసుకున్న దరఖాస్తులను పరిశీలించి జనవరి 21నుంచి 24 వరకు జరిగిన వార్డు సభల్లో జాబితాను ప్రదర్శించారు. ఈ జాబితాల్లో చాలా మందికి రేషన్ కార్డులు మంజూరు కాలేదు. దీంతో మరోసారి దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని కల్పించారు. ఈ క్రమంలో అర్హులంతా రేషన్‌కార్డుల కోసం మళ్లీ దరఖాస్తు చేసుకున్నారు. మళ్లీ అధికారులు ప్రకటించిన జాబితాలో సైతం అర్హులకు న్యాయం జరగలేదు.

### ప్రభుత్వం గొప్పలు తప్పా చేతలు లేవు

కాంగ్రెస్ ప్రభుత్వం గొప్పలు చెబుతోంది తప్పా ఆచరణలో శూన్యం. ఇటీవల అరకొరగా రేషన్ కార్డులు మంజూరు చేసి చేతులు దులుపుకుంది.తాము రేషన్ కార్డులు చాలా మంజూరు చేశామని చెబుతుంది. కానీ క్షేత్రస్థాయిలో అర్హులైన చాలామంది రేషన్ కార్డులు రాక ఇబ్బందులు పడుతున్నారు. రేషన్‌కార్డులో పేర్లు యాడ్ చేశామని చెబుతుంది. దీంట్లో చాలా సమస్యలు వస్తున్నాయని రేషన్ డీలర్లు చెబుతున్నారు.ప్రధానంగా పెండ్లి అయి అత్తగారింటికి వెళ్లిన ఆడపిల్లలకు యాడింగ్ ఆప్షన్‌లో దరఖాస్తు చేసుకున్నా కావడం లేదు. చాలా రోజుల నుంచి రేషన్ కార్డుల్లో పేర్ల నమోదు కోసం ఎదురు చూసిన (ఐదారేండ్ల కింద పెండ్లి అయిన) వారు ఇప్పుడు ఇచ్చిన యాడ్ ఆప్షన్ ఆధారంగా అత్తగారింటి వద్ద దరఖాస్తు చేసుకుంటే ఆపేర్లు అమ్మాయి తల్లిగారింటి కార్డుల్లో నమోదయ్యాయి. చాలా చోట్ల ఇలాంటి సంఘటనలు చోటు చేసుకున్నాయి. గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో పేర్ల నమోదుకు దరఖాస్తు చేసుకోగా అవి కలెక్టర్ లాగిన్‌లో ఉంటే వాటినే ఇప్పుడు అనుమతి ఇచ్చి తమ ప్రభుత్వం చేసింది అని కాంగ్రెస్ నేతలు చెప్పుకుంటున్నారు.

### ఉమ్మడి జిల్లాలో రేషన్ కార్డులు ఇలా..

సిద్దిపేట జిల్లాలో మొత్తం రేషన్ దుకాణాలు 688 ఉన్నాయి. వీటి ద్వారా జిల్లాలోని 2,91,327 మంది రేషన్ కార్డుదారులకు ప్రతినెలా 5,775 మెట్రిక్ టన్నుల బియ్యం సరఫరా జరుగుతంది. ఈ జిల్లాలో 18,336 అంత్యోదయ, 2,72,909 ఆహార భద్రత, 82 అన్నపూర్ణ కార్డులు ఉన్నాయి. మెదక్ జిల్లాలో 520 రేషన్ దుకాణాలు ఉండగా వీటి ద్వారా 4,430. 496 మెట్రిక్ టన్నుల బియ్యం అందిస్తున్నారు. వీటిలో 13,860 అంత్యోదయ, 1,99,902 ఆహార భద్రత, 66 అన్నపూర్ణ, మొత్తం 2,13,828 కార్డులు ఉన్నా యి. సంగారెడ్డి జిల్లాలో 26,115 అంత్యోదయ, 3,52,513 ఆహార భద్రత, 100 అన్నపూర్ణ, మొత్తం 3,78,728 కార్డులు ఉన్నాయి. జిల్లాలో ప్రతినెలా 7,998.781 మెట్రిక్ టన్నుల బియ్యం ప్రజలకు అందిస్తున్నారు.

| జిల్లా పేరు | అంత్యోదయ | ఆహార భద్రత | అన్నపూర్ణ | మొత్తం | బియ్యం (టన్నుల్లో) |
|---|---|---|---|---|---|
| సిద్దిపేట | 18,336 | 2,72,909 | 82 | 2,91,327 | 5,775.742 |
| మెదక్ | 13,860 | 1,99,902 | 66 | 2,13,828 | 4,430.496 |
| సంగారెడ్డి | 26,115 | 3,52,513 | 100 | 3,78,728 | 7,998.781 |

ఉమ్మడి జిల్లాలో రేషన్ కార్డు కోసం మీ సేవ ద్వారా వచ్చిన దరఖాస్తులు

| జిల్లా | దరఖాస్తులు | మంజూరు | పెండింగ్ |
|---|---|---|---|
| సిద్దిపేట | 2,562 | 1562 | 1000 |
| మెదక్ | 1,262 | 450 | 812 |
| సంగారెడ్డి | 8,315 | 435 | 7,880 |
| మొత్తం | 12,139 | 2,447 | 9,692 |



# ఈనెల 5 నుంచి రెవెన్యూ సదస్సులు

- మే నెల చివరి వరకు ప్రతి దరఖాస్తు క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలి
- వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ రాహుల్‌రాజ్, అధికారులు

మెదక్, మే 2(నమస్తే తెలంగాణ): భూ భారతి చట్టం ప్రకారం ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి సీఎస్ రామకృష్ణారావు, సీసీఎల్‌ఏ కమిషనర్ నవీన్ మిట్టల్‌లతో కలిసి భూ భారతి చట్టం రెవెన్యూ సదస్సులు, నీట్ ప్రవేశ పరీక్ష నిర్వహణ, ఇందిరమ్మ ఇండ్లపై జిల్లా కలెక్టర్లతో మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మెదక్ సమీకృత జిల్లా కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, అదనపు కలెక్టర్ నగేశ్, డీఆర్వో భుజంగరావు, ఏఎస్పీ మహేందర్, జడ్పీ సీఈవో ఎల్లయ్య వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. ఈనెల 5 నుంచి మే 20 వరకు పైలట్ ప్రాజెక్టు జిల్లాలు మినహాయించి మిగిలిన జిల్లాల్లో ఒక మండలాన్ని పైలట్‌గా తీసుకొని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించి భూ సమస్యలపై ప్రజల నుంచి దరఖాస్తులు తీసుకోవాలని సూచించారు. జూన్ 2వరకు పైలట్ ప్రాజెక్ట్ కింద వచ్చిన దరఖాస్తులు పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఈ ప్రాజెక్టు కింద చేపట్టిన 4 మండలాల్లో రెవెన్యూ సదస్సుల్లో భూసమస్యలపై ప్రజల నుంచి 12,759 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. భూభారతి చట్టంలో దరఖాస్తు చేసుకునే సమయంలో సరిగ్గా దరఖాస్తు నమోదయ్యేలా హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేయాలని సూచించారు. భూసర్వేకు సంబంధించిన సమస్యలు, ఆర్‌ఎస్‌ఆర్ ఎక్సస్ సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్డీవో శ్రీనివాసరావు, హౌసింగ్ పీడీ మాణిక్యం, డీపీఓ యాదయ్య, అధికారులు పాల్గొన్నారు.

# పోలీసులు నైపుణ్యాలు మెరుగుపర్చుకోవాలి

- మల్టీ జోన్ ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి



పోలీసు ఫైరింగ్ రేంజ్‌ను ప్రారంభించి పరిశీలిస్తున్న ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి, చిత్రంలో కలెక్టర్ రాహుల్‌రాజ్, తదితరులు

చేగుంట, మే 2: మారుతున్న కాలానుగుణంగా పోలీసులు వృత్తి నైపుణ్యం పెంపొందించుకోవాలని, ఆయుధం నైపుణ్యం మెరుగుపరుచుకోవాలని మల్టీ జోన్ ఐజీ చంద్రశేఖర్ రెడ్డి సూచించారు. మెదక్ జిల్లా నార్సింగి మండలంలోని మాలగుట్ట ప్రాంతంలోని ఐదెకరాల ప్రభుత్వ భూమిలో ఏర్పాటు చేసిన పోలీసు ఫైరింగ్ రేంజ్‌ను శుక్రవారం కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం ఫైరింగ్ స్థలాన్ని పరిశీలించారు. ఐజీ మాట్లాడుతూ.. విధి నిర్వహణలో పోలీసు సిబ్బందికి ప్రతి సంవత్సరం ఫైరింగ్ ప్రాక్టీస్ ఉంటుందని, మెదక్ సిబ్బంది ఫైరింగ్ చేయుటకు సిద్దిపేట జిల్లాలోని రాజ్‌గోపాల్‌పేట్ వద్ద ఉన్న ఫైరింగ్ రేంజ్‌లో ప్రాక్టీస్‌కు వెళ్లేవారని, ఇప్పుడు నార్సింగి మండలంలో ఏర్పాటు చేసినందుకు ఎస్పీని అభినందించారు. భూమి కేటాయించిన కలెక్టర్ రాహుల్‌రాజ్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రస్తుతం సైబర్ నేరాలు పెరిగాయని, ఆన్‌లైన్ మోసాలు ఎక్కువయ్యాయని, సమాజంలో నేరాల కొత్తకొత్త రూపంలో జరుగుతున్నాయని ఐజీ తెలిపారు. కాబట్టి ప్రతి పోలీస్ సిబ్బంది అన్ని అంశాల్లో శిక్షణ పొందాలని, తగిన నైపుణ్యాలను పెంపొందించుకొని కేసులను పరిష్కరించాలని సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్ర ఎనలేనిదని ఐజీ కొనియాడారు. ఏఎస్పీ మహేందర్, ఏఆర్ డీఎస్పీ రంగనాథ్, తూప్రాన్, మెదక్ డీఎస్పీలు ఎస్.వెంకట్‌రెడ్డి, ప్రసన్నకుమార్, రామాయంపేట సీఐ వెంకట్ రాజాగౌడ్, ఇతర సీఐలు, ఎస్సైలు, సిబ్బంది, తహసీల్దార్ కరీం, సర్వేయర్ శ్రీకాంత్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# సబ్‌స్టేషన్ ఎదుట రైతుల నిరసన



సంగారెడ్డి జిల్లా ఎల్గోయిలో సబ్‌స్టేషన్ ఎదుట నిరసన తెలుపుతున్న రైతులు

- పూర్తిగా నిలిచిపోయిన త్రీఫేజ్ విద్యుత్ సరఫరా
- ఆగ్రహించిన ఎల్గోయి రైతులు

ఝరాసంగం, మే 2: సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండలంలోని ఎల్గోయిలో ఐదు రోజులుగా త్రీఫేజ్ విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిచి పోయిందని, ఫలితంగా సాగులో ఉన్న పంటలు ఎండుముఖం పడుతున్నాయంటూ రైతులు శుక్రవారం ఎల్గోయి సబ్‌స్టేషన్ ఎదుట నిరసన తెలిపారు. ఎండల తీవ్రత ఎక్కువ ఉండడం, కరెంట్ కోతలతో పంటలకు సాగునీరు అందక పోవడంతో పంటలు ఎండిపోతున్నట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మా ఊరిలో సబ్‌స్టేషన్ ఉన్నా కరెంట్ కష్టాలు తప్పడం లేదని తెలిపారు. స్థానిక లైన్‌మెన్‌కు, ఏఈకి అనేకసార్లు ఫోన్లు చేసినప్పటికీ సరిగ్గా స్పందించడం లేదన్నారు. విద్యుత్ అధికారులు వెంటనే స్పందించకపోతే తాము డివిజన్ స్థాయిలో నిరసనలు చేపడుతామని రైతులు హెచ్చరించారు. నిరసనలో రైతులు అశోక్, అంజన్న, శేఖర్, యేసయ్య, ప్రభు, జానుమీయ, మక్బూల్, విఠల్, విశ్వనాథం, నగేశ్, వెంకన్న, సిద్దన్న, రాములు పాల్గొన్నారు.

# పటాన్‌చెరులో ట్రాఫికర్

## -బస్టాండ్ వద్ద తీవ్రమైన ట్రాఫిక్ సమస్య



పటాన్‌చెరు ఆర్టీసీ బస్టాండ్ ఎదుట ట్రాఫిక్

- ఉదయం, సాయంత్రం భారీగా నిలిచిపోతున్న వాహనాలు
- జరిమానాలపైనే పోలీసుల దృష్టి
- బస్టాండ్ పార్కింగ్‌లో అధికంగా డబ్బులు వసూలు?

పటాన్‌చెరు, మే 2: పటాన్‌చెరు బస్టాండ్ వద్ద ట్రాఫిక్ కష్టాలు ప్రజలకు చుక్కలు చూపిస్తున్నాయి. నిత్యం తెలంగాణతో పాటు కర్ణాటక, మహారాష్ట్రకు చెందిన ఆర్టీసీ బస్సులతో హైదరాబాద్‌కు చెందిన వేలాది సిటీ బస్సులు ఈ బస్టాండ్ మీదుగా రాకపోకలు సాగిస్తుంటాయి. పటాన్‌చెరు బస్టాండ్ పరిసరాలు నిత్యం ప్రయాణికులతో కిటకిటలాడుంటుంది. ప్రతిరోజు వేలాది మంది ప్రయాణికులు పటాన్‌చెరు ఆర్టీసీ బస్టాండ్ నుంచి హైదరాబాద్‌తో పాటు అనేక ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారు. పటాన్‌చెరు ఆర్టీసీ బస్టాండ్ ముందు ఆటోలు, ప్రైవేట్ వాహనాలు నిలుపుతుండడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బస్టాండ్ ముందు ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంటున్నది. బస్టాండ్ లోనికి వెళ్లేందుకు ప్రయాణికులకు ఇబ్బందిగా మారుతున్నది. బస్టాండ్‌లో బస్సుల కోసం వేచి ఉంటున్న ప్రయాణికులకు సరైన కుర్చీలు లేక నిలిచి ఉంటున్నారు. ఆర్టీసీ అధికారులు ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంలో విఫలమవుతున్నారు. పటాన్‌చెరు బస్టాండ్‌లో ఉన్న వాహనాల పార్కింగ్ నిర్వాహకులు అధికంగా డబ్బులు వసూలు చేస్తున్నా అధికారులు చర్యలు తీసుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. బైక్‌కు గంటకు రూ. 5 వసూలు చేయాలి. కానీ, నిర్వాహకులు గంటకు రూ. 10 వసూలు చేస్తున్నారు. దీనిపై వాహనదారులు ప్రశ్నిస్తే వారితో దురుసుగా ప్రవరిస్తున్నారు.

### ఆర్టీసీ బస్టాండ్ ఎదుట తీవ్ర ట్రాఫిక్ సమస్య...

పటాన్‌చెరు ఆర్టీసీ బస్టాండ్ ముందు జాతీయ రహదారిపై ట్రాఫిక్ సమస్య వేధిస్తున్నా పోలీసులు పట్టించుకోవడం లేదు. ప్రతి రోజు బస్టాండ్ ముందు ట్రాఫిక్ పోలీసులు విధులు నిర్వహించినా, వారు ట్రాఫిక్ సమస్యను క్లియర్ చేయడం లేదు. కేవలం వాహనాలకు ఫైన్‌లు రాయడమే లక్ష్యంగా పనిచేస్తున్నారు. బస్టాండ్ ముందు వాహనాలు నిలిచిపోయినా ట్రాఫిక్ పోలీసులు ట్రాఫిక్‌ను క్లియర్ చేయడం లేదు. రోడ్డుపై నుంచి వెళ్లున్న వాహనాలను నిలిపి నిబంధనల పేరుతో చలానా రాస్తున్నారు. ట్రాఫిక్ సమస్యను పర్యవేక్షణ చేసేందుకు ఎస్సై స్థాయి అధికారి లేకపోవడంతో హెడ్‌కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు విధులు నిర్వహిస్తున్నారు. బస్టాండ్ లోపలికి వెళ్లకుండా వాహనాలు రోడ్డుపైన అడ్డంగా నిలిపినా చర్యలు తీసుకోవడం లేదు. ట్రాఫిక్ పోలీసులు బస్టాండ్ ముందు తనిఖీలు చేస్తుండడంతో భారీగా వాహనాలు నిలిచి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. బస్టాండ్‌లోకి, బయటకు వచ్చే రోడ్డు ముందు ఆటోలు, ప్రైవేట్ వాహనాలు నిలిపినా చర్యలు తీసుకోవడం లేదు. కొన్ని సార్లు బస్టాండ్ నుంచి బయటకు వచ్చే బస్సులు నిలిచిపోతున్నాయి.



పటాన్‌చెరు ఆర్టీసీ బస్టాండ్‌లో అవసరమైన కుర్చీలు లేకపోవడంతో బస్సుల కోసం నిలిచి ఉన్న ప్రయాణికులు